ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 సంచిక : 12 ఆగష్టు 2017

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

09-07-2017
జిన్నూరు
25-11-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-07-2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు గురుపూర్ణిమ సందర్భంగా మనం ఇక్కడ సమావేశం అయ్యాము. భారతీయులకు, హిందువులకు దీపావళి, సంక్రాంతి ఎటువంటివో ఈ గురుపూర్ణిమ కూడా ఒక పండుగ. ప్రపంచంలో ఎక్కువ మంది మహాత్ములు పౌర్ణిమరోజున జన్మించారు. బుద్ధుడు కూడా పౌర్ణిమరోజున జన్మించాడు. అంతేకాదు బుద్ధుడు ఇల్లు విడిచి పెట్టింది కూడా పౌర్ణిమ రోజునే, ఆయనకు జ్ఞానోదయం అయ్యింది కూడా పౌర్ణిమ, చివరకు ఆయన శరీరం విడిచిపెట్టింది కూడా పౌర్ణిమ రోజునే. వ్యాసుడు ఆషాఢ పౌర్ణిమ రోజున శరీరం తీసుకున్నాడు. వ్యాసుడి యొక్క జన్మదినోత్సవాన్ని గురుపూర్ణిమగా నిర్ణయించి, దానిని గురువును గౌరవించేరోజుగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. బి గుడ్, డు గుడ్ అని శివానంద చెప్పారు. డూ గుడ్ తేలికే గాని బి గుడ్ కష్టం. అంటే మీ తోటి మీరు పోరాటం పెట్టుకోవాలి. మనం ఇతరులతో పోరాడటం కంటే మనతో మనం పోరాడటం కష్టం. అందుచేత డూ గుడ్ కంటే బీ గుడ్‌గా ఉండటం చాలా కష్టం అని శివానంద చెప్పేవారు.

మీరు ఎంత ధనవంతులు అయినా, మీకు ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత యశస్సు ఉన్నా మీకు జ్ఞానం రాదు. పాండిత్యానికి జ్ఞానానికి సంబంధం లేదు. నాకు తెలుసును, నాకు తెలియదు అని చెప్పేది పాండిత్యానికి సంబంధించినది. ఇక్కడ జ్ఞానం అంటే ఇప్పుడు శరీరం ఎలా అయితే మీకు ఎఱుకలో ఉందో, మనస్సు ఎలా అయితే మీకు ఎఱుకలో ఉందో అలా మీ లోపలఉన్న సద్వస్తువు మీకు ఎఱుకలోనికి రావాలి, అది జ్ఞానం అంటే. అంతేగాని ఈ తెలుసును, తెలియదు అనేది అంతా అజ్ఞానంలో ఒక భాగమే. అందుచేత జ్ఞానానికి,

పాండిత్యానికి ఏమీ సంబంధంలేదు. రామకృష్ణుడు ఏమీ చదువుకోలేదు కాని ఆయన ప్రపంచానికి గురువు అయ్యాడు అంటే రామకృష్ణుడు 100% ప్యూరిఫైడ్ మేన్. ఈ ప్రపంచంలో ఇది నాది అని చెప్పేది ఆయనకు ఏమీ లేదు. అక్కడ నేను, నాది అని ఏమీ లేవు. మీకు ఏమి ఉంది అని ఎవరయినా అడిగితే మాకు ఏమీ లేదు అని చెప్పటానికి మనం సిగ్గుపడతాము కానీ రామకృష్ణుడు సంతోషిస్తాడు. ఎందుచేతనంటే ఆయన వాటిమీద ఆధారపడి లేడు, ఆయనకు లోపల బలం ఉంది. ధనం, పాండిత్యం ఇవన్నీ ప్రకృతి విషయాలు. ప్రపంచంలో ఏ పండితుడిని ఆయన పట్టించుకోలేదు. నీలో కనుక స్వార్థం ఉంటే లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తం కాదు. ప్రపంచంలో ఏ స్వార్థపరుడికి ఇంతవరకూ జ్ఞానం రాలేదు. మీ లోపల ఉన్న సద్వస్తువు ఎవడికి వ్యక్తం అవుతుంది అంటే దానిని నువ్వు తెలుసుకోలేవు, నీకు ప్యూరిటీ ఉంటే ఆ సద్వస్తువు దానంతట అదే నీకు ఎఱుకలోనికి వస్తుంది. మీకు చదువులేదు అందుచేత చదువుకున్న వాళ్ళ విలువ మీకు తెలియటం లేదు అని రామకృష్ణుడితో భక్తులు అనేవారు. వాళ్ళు బాగా చదువుకున్నారు అని మీరు చెపుతున్నారు, మీరు చెప్పేది రైటే అయితే వాళ్ళకు ఏమైనా తోకలు తెగాయా అంటే దేహబుద్ధి పోయిందా? ఏదైతే పోవాలో వాళ్ళకు అది పోయిందా అంటే దేహబుద్ధి పోయిందా వారికి. లోపల ఉన్న రియల్ ఐ తాలూకు ఎఱుక వాళ్ళకు ఏమైనా వచ్చిందా అంటే రాలేదు అయితే వాళ్ళు పెద్ద సున్నలు అని చెప్పారు. దేవేంద్రనాథ్ ఠాగూర్ పెద్ద పండితుడు. ఒకసారి రామకృష్ణుడిని శిష్యులు ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళారు. తిరిగివచ్చేటప్పుడు శిష్యులు రామకృష్ణుడితో ఆయన గొప్ప పండితుడు అని చెప్పారు. రామకృష్ణుడు ఏమన్నాడంటే వాడు చదువుకొన్న మాట నిజమే కానీ ప్రపంచంలో ఉన్న భోగాలు అన్నీ వాడికి కావాలి. ఇంక ఎందుకు వచ్చిన చదువులు. గొప్ప పండితుడు అని మీరు చెపుతున్నారు, ఆ పాండిత్యం అంతా పొయ్యిలో పెట్టుకోవాలి. అసలు ప్రకృతి లక్షణాలు పోవాలి కదా. ప్రకృతి గుణాలు పోకుండా ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత ధనం ఉన్నా వాడికి జ్ఞానం రాదు. చనిపోయేటప్పుడు ఈ పండితులు అంతా మేము చనిపోతున్నాము అని అనుకొంటున్నారు కదా. నువ్వు చావుని జయించాలి కదా. ఈ పాండిత్యం అంతా చావటానికా? చనిపోవటానికి చదువుకొంటున్నారా మీరు అంటున్నాడు రామకృష్ణుడు. అసలు నువ్వు ఎవడివో నీకు తెలియకుండా నేను చదువుకొన్నాను, నేను చదువుకొన్నాను అంటే నువ్వు ఫాల్స్ ఐ మధ్యలో ఉన్నావు కదా. నీకు డోయర్‌షిప్ పోలేదు, ఓనర్‌షిప్ పోలేదు. ఇవి రెండూ ఉన్నప్పుడు వాడు ప్రకృతిని జయించలేడు.

దేహప్రారబ్దంలో ఏదయితే ఉందో అది జరిగిపోతూ ఉంటుంది. మనం ఏమీ చేయలేము. మనం అనుకొన్నది జరగవచ్చు, జరగకపోవచ్చు. సృష్టిలో జరిగేదంతా ఈశ్వర సంకల్పమే. ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా భగవాన్ ఎప్పుడూ అబ్బురపడలేదు. ఆ

సంఘటన ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. ప్రపంచానికి అంతర్యామిగా ఉన్న వాడు ఆయనే. ఈశ్వరుడికి తెలియకుండా ఏదీ జరగదు. అందుచేత ఇందులో మనం ఆశ్చర్యపోవలసిన విషయం ఏమీ లేదు. ఉన్నది నలుబది సద్విద్య మీరు చదువుతూ ఉండండి. శబ్దంయొక్క అర్థం మీకు తెలిసినా, తెలియకపోయినా అలా చదువుతూ ఉండండి. అలా చదవటం వలన చివరకు ఆ శబ్దాలు పోతాయి, వాటి అర్థం మీ గుండెకు పడుతుంది.

గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. ప్రపంచంలో బయట ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు. కాని మన లోపలఉన్న చీకటిని పోగొట్టేవాడు గురువు. బయట ఉన్న చీకటిని సూర్యుడు ఎలా అయితే పోగొడుతున్నాడో అలాగే మనలోపల ఉన్న అజ్ఞానం, అవిద్య అనే చీకటిని పోగొట్టేవాడు గురువు. మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. అది మీకు తెలుసున్నా ఉంది, తెలియకపోయినా ఉంది. సూర్యుడు మనకు కనబడకుండా మేఘం ఎలా మూసేస్తుందో అలాగే మనలో ఉన్న అజ్ఞానం, అవిద్య లోపలఉన్న సద్వస్తువు మనకు తెలియకుండా మూసేస్తున్నాయి. సూర్యుడు మనకు కనబడకుండా మేఘం మూసేసినప్పుడు కూడా సూర్యుడి కంటే ఆ మేఘం గొప్పది కాదు. కాని సూర్యుడిని మూసేయటానికి పనికి వస్తోంది. అలాగే నీలో ఉన్న అజ్ఞానం నీ లోపలఉన్న సద్వస్తువు కంటే గొప్పది ఏమీ కాదు. గాలివేస్తే,మేఘం పోతుంది అలాగే గురువు అనుగ్రహం కనుక ఉంటే నీకు లోపల ఉన్న అజ్ఞానం పటాపంచలు అవుతుంది. మనం మనోదేహాలను నమ్మటానికి వీలులేదు. ఈ రోజు శరీరం బాగుంది. రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. అలాగే మనస్సు కూడా ఈ రోజు నిర్మలంగా ఉండవచ్చు కానీ రేపు దానికి చపలత్వం రావచ్చు. ఎందుచేతనంటే ఇవి రెండూ నిజం కాదు కదా. నిజమయితే అది ఒకటిగా ఉంటుంది. కాని నిజం కానిది ఒకటిగా ఎలా ఉంటుంది. మన శరీరం, మనస్సు రేపు ఎలా ఉంటాయో మనకు తెలియదు. మన మనస్సు స్థిరంగా లేకపోవటం వలననే దస్తావేజులు రాసుకోవటం, పోలీస్‌స్టేషన్‌లు వచ్చాయి, మనస్సు స్థిరంగా ఉంటే ఇవన్నీ ఎందుకు? అందుచేత మనోదేహములను నమ్మటానికి వీలులేదు ఈ మనోదేహములతో లోపల ఉన్న సద్వస్తువుకు ఇసుమంతయు సంబంధం లేదు.

నీలోపల ఒక నిజం ఉంది. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఈ జన్మలో కాకపోయినా రాబోయేజన్మలో అయినా దానిని తెలుసుకొనితీరాలి. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియబడకపోతే నీకు ఫ్రీడమ్ లేదు, హేపీనెస్ లేదు, పీస్ లేదు. శరీరాలు ఒక దాని తరువాత ఇంకొకటి నిన్ను బంధిస్తూనే ఉంటాయి అని బైబిల్‌లో చెప్పాడు. సత్యం అంటే మనం నోటితో మాట్లాడుకొనేది కాదు, అసలు దానిని డిఫైన్ చేయలేము. ఆనందం అనేది అక్కడ తప్పించి ఇంక ఎక్కడా లేదు. ప్రపంచంలో ఆనందం ఉంది అనుకొంటున్నాము.

ఆనందం కోసం ప్రపంచంలో వెదుకుచున్నాము. ఎక్కడైతే ఆనందం లేదో అక్కడ ఆనందం కోసం వెదుకుచున్నాము. ఇలా లేనిచోట ఎంత వెదికినా నీకు ఆనందం దొరకదు. మనిషి సుఖపడాలంటే మెటీరియల్ సైడే కాకుండా స్పిరిట్యువల్‌సైడ్ కూడా గ్రోత్ ఉండాలి. స్పిరిట్యువల్ సైన్స్ కొంత అర్థం చేసుకోవాలి, దానిని అభ్యసించాలి. కేవలం అన్నం తిని మీరు బతకగలరా? బాహ్యంగా మనకు ఎవరో ఒకరి సపోర్టు ఉండాలి. అదే మీకు స్పిరిట్యువల్ స్టేటస్ కనుక ఉంటే, ఆ మెచ్యూరిటీ కనుక మీకు ఉంటే మీరు ఒక్కరు ఉన్నా కూడా, మనం ఒకళ్ళమే ఉన్నాము అనే భావన లేకుండా జీవించగలరు. బుద్ధుడికంటే ఆచార్యులవారు తెలివైన వారు అని కృష్ణంరాజుగారు చెప్పారు. అది రైటే గాని ప్రపంచంలో బుద్ధుడికి వచ్చిన కీర్తి ఆచార్యుడికి రాలేదు. బుద్ధుడిలో ఏమీ బలహీనతలు లేవు. ఆయన రాజ్యాన్ని విడిచిపెట్టాక, రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపు కూడా ఆయనకు రాలేదు. అసలు ఆ దేశానికి వారసుడిని పెట్టలేదు. అసలు ఒక్క బలహీనత కూడా ఆయనలో లేదు, 100% ప్యూరిటీ.

ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మీరు తీర్థయాత్రలు చేసినా, గుడులు చుట్టూ తిరిగినా ఇవన్నీ కూడా జ్ఞాని యొక్క ఒక్క చూపుతోటి సరిపోవు. జ్ఞాని యొక్క మాట శక్తివంతంగా ఉంటుంది. అది కొండలను దాటుతుంది, సముద్రాలను దాటుతుంది, ఈ ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. ఎందుచేతనంటే జ్ఞానియొక్క నాలుక హృదయంలో ఉంటుంది. మన నాలుక అయితే నోట్లో ఉంటుంది. మనం ఆలోచించేది వేరు, మాట్లాడేది వేరు, చేసేది వేరు. జ్ఞానికి అదేమీ ఉండదు. ఆయన హృదయంలో ఉన్నదే వస్తుంది. జ్ఞాని సత్యసంకల్పుడు. నువ్వు బాగుపడాలి అనే సంకల్పం ఆయనకు వస్తే అది నీ మీద పనిచేస్తుంది. జ్ఞాని యొక్క ప్రభావం భక్తుల మీద ఉంటుంది. జ్ఞాని అన్నా, మహాత్ముడు అన్నా, గురువు అన్నా ఇవి అన్నీ పర్యాయపదాలు. మనం గురువును పట్టుకొంటే మనం వదిలేస్తే వదిలేయవచ్చు. అలాకాకుండా గురువు మనలను పట్టుకొంటే వదలటం కుదరదు. ఇప్పుడు నా విషయం చెపుతున్నాను. నేను భగవాన్ రూపం ఎప్పుడూ చూడలేదు, ఆయన సాహిత్యం ఎప్పుడూ చదవలేదు, భగవాన్ పేరు ఎవరైనా చెపుతుంటే వినలేదు. ఆయనే నాకు స్వప్న దర్శనం ఇచ్చి, ఆయన వివరాలు చెప్పి నన్ను ఎత్తుకున్నారు, అప్పుడు నాకు భయం వేసింది. ఆయన నాకు ఒక కిస్ ఇచ్చి, ప్రస్తుతానికి ఇది సరిపోతుంది అన్నారు. నేను భగవాన్‌ను తీసుకోలేదు, ఆయనే నన్ను తీసుకున్నారు. అందుచేత ఎటాచ్‌మెంట్ పోయే అవకాశం లేదు, పులి నోట్లో పడ్డ మాంసపు ముక్కను బయటకు తీయవచ్చునేమో గాని, గురువు అనుగ్రహంలో పడినవాడు బయటకు వచ్చే అవకాశం లేదు. వాడిని రక్షించి తీరుతాడు. అంటే గురువు యొక్క ప్రభావం అంత తీవ్రంగా ఉంటుంది. గురువు చేసే సహాయం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. అవి మనకు అర్థంకాని విషయాలు.

వాసనల సమూహామే మనస్సు. మనస్సు మేటర్ లేకుండా ఉండలేదు. మనస్సు శరీరాన్ని క్రియేట్ చేస్తుంది. మనం నో మైండ్ స్టేట్‌కు రావాలి. నో మైండ్ స్టేట్‌ని పొందటానికి మన ప్రయత్నం ఏదో మనం చేస్తూ ఉంటాము. కాని గురువు సహాయం లేకుండా అది కంప్లీట్ అవ్వదు. మనకు గురువు బిగ్గెస్ట్ రెలిటివ్. వారు చుట్టాలు, వీరు చూట్టాలు అని మనం ఏదో అనుకొంటాము కాని గురువును మించిన పెద్ద బంధువు మనకు ఎవరూ లేరు. గురువుకంటే మన క్షేమం కోరేవాడు ఎవడూ లేడు. తల్లిదండ్రులు మనకు బట్టలు కొని ఇవ్వవచ్చు, చదువు చెప్పించవచ్చు. ఇవి అన్నీ భౌతికం. గురువు యొక్క ప్రేమ అది అన్ వరల్డ్ లవ్. అది భౌతికానికి సంబంధించినది కాదు. గురువు ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి మనలను తీసుకొనిపోయేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు, ఆ జన్మకాజన్మ మనలను వెంటాడుతూనే ఉంటాడు. మీరు భగవాన్‌కు ఎప్పుడూ పూజ చేయటం లేదు అయినా మీరంటే ఇష్టపడుతున్నాడు. మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు కారణం ఏమిటి అని ఒక డాక్టరుగారు అడుగుతున్నారు. పైగా సుందరంగారు ఒక మాట అన్నారు భగవాన్‌కు శరీరం లేదు, మీకు శరీరం ఉంది. శరీరం ఉండటం లేకపోవటమేకాని ఇంక తేడా ఏముంది అంటున్నారు? అయితే భగవాన్‌కు ఉన్న స్పిరిట్యువల్ స్టేటస్ నాకు ఉందా అంటే లేదు అని తెలిసినా అలా చెప్పేస్తున్నారు. అలా చెప్పించేవాడు కూడా ఆయనే. గురువు యొక్క అనుగ్రహానికి అసాధ్యమంటూ ఏమీ లేదు. ఆయన ఏదైనా చేయగలడు. బైబిలులో ఒక మాట ఉంది. కొండమీద దీపం పెట్టి అది ఎవరికీ కనబడకూడదు అంటే ఎలా కుదురుతుంది? అలాగే నీకు జ్ఞానోదయం అవుతూ ఉంటే మీ ఇంట్లో వారు నిన్ను మూసేస్తాము అంటే ఎలా కుదురుతుంది? మీ అమ్మ, నాన్న నిన్ను ఎవరికీ కనబడనివ్వము అని బట్టపెట్టి మూసేస్తాము అంటే అది కుదరదు.

మీకు ఇంటినిండా డబ్బు ఉంది కాని మిమ్మల్ని దుఃఖం వెంటాడుతోంది. మిమ్మల్ని అలాగే ఉంచితే ఎలాగ? దుఃఖంలేనిస్థితికి మిమ్మల్ని తీసుకొనిపోవాలి కదా! అసలు గురువు యొక్క లక్ష్యం అదే. మీ అమ్మ బట్టలు కొని ఇస్తుంది కాని మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొనిపోలేదు. అది గురువుకే సాధ్యం. గురువుతో సాంగత్యం వలన బాహ్యంగా దాని ప్రభావం నీకు తెలియకపోయినా అది నీ హృదయంలో ఉన్న నిజాన్ని పట్టియిస్తుంది. ఒక అమెరికన్ సైంటిస్టు ఏమని చెప్పాడు అంటే శరీరం పోయినప్పుడు ఇంక జీవితం కూడా ముగిసిపోతుంది, మరణానంతరజీవితం లేదు అని అనుకొనేవాడిని. నేను సౌత్ఇండియాలో ఒక మహర్షిని చూసాను. ఆయన నాతో మాట్లాడలేదు, నేను ఆయనతో మాట్లాడలేదు. నేను అక్కడ 40నిమిషాలు కూర్చొన్నాను. ఆయన నావంక చూసారు, నేను ఆయనను చూసాను, ఒక్కమాటలేదు. కాని ఆయన సమక్షంలో కూర్చోవటం వలన నా హృదయంలో

ఏదో నిజం ఉందని నాకు స్ఫురించింది. కాని ఆ ఉన్నదేదో నాకు తెలియటం లేదు అన్న సంగతి కూడా స్ఫురించింది. యిప్పుడు దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి అంత వరకు ఆయన నాకు ఉపయోగపడ్డాడు అని చెప్పాడు. గురువు మౌనంగానే పని చేస్తాడు. ఒకవేళ గరువుకు మీ పట్ల దయ ఉన్నా అల్లరిగా ఉండదు. ఆయన మౌనంగానే పనిచేస్తాడు. మీ అమ్మ నీకు ఒక ఎకరం పొలం యిస్తే మా అమ్మాయికి ఎకరం పొలం ఇచ్చాను అని ఊరంతా చెపుతుంది కదా. గురువుకు అదేమీ ఉండదు. ఆయనకు పబ్లిసిటీ అక్కరలేదు, గుర్తింపులు అక్కరలేదు. మీరు కష్టపడితే గుర్తింపులు కోరుకొంటారు. అదే చెడ్డ. దానివలన ఈగోసెన్స్ పెరిగిపోతుంది. గురువు నీతో మాట్లాడకపోయినా ఆయన మౌనంగానే పనిచేస్తాడు. మాటకంటే మౌనం శక్తివంతమైనది. మానసిక సంకల్పం ముఖ్యం. శరీరాలు దూరంగా ఉన్నా వారు బాగుండాలి అని మనస్సులో అనుకొంటే చాలు. దగ్గరగా ఉండి విరోధంగా ఉండటం కంటే, దూరంగా ఉండి ఆప్యాయతగా ఉండటం మంచిది.

ఒక అమ్మాయి భగవాన్‌తో చెపుతోంది నేను ఈ రోజు మా దేశం ఇంగ్లండ్ వెళ్ళిపోతున్నాను. ఎక్కువగా ఇండియాకు రాలేను. నన్ను జ్ఞాపకం పెట్టుకోండి అని భగవాన్ తో చెప్పింది. అప్పడు భగవాన్ ఏమన్నారంటే యిఫ్ యు రిమెంబర్ మి, ఐ విల్ రిమెంబర్ యు. నువ్వు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటే నేను నిన్ను జ్ఞాపకం పెట్టుకొంటాను అన్నారు. అప్పడు ఆ అమ్మాయి ఏమందంటేమీరు కండిషన్ పెడుతున్నారు. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకొంటే మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటాను అంటున్నారు, ఈ మాటలుఅన్నీ కూడా జీవ లక్షణాలు. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోకపోయినా మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోవాలి కదా అంది. నేను పొరపాటు మాట్లాడాను, నువ్వు చాలా గట్టి అన్నారు భగవాన్. గురువు అంటే ఆ శరీరం కాదు. శరీరం కాదు కాబట్టే ఆ శరీరంపోయినా ఆయనతో మనకు ఉన్న సంబంధం కంటిన్యూ అవుతూ ఉంటుంది. గురువు అంటే శరీరం కాదు. ఆ శరీరం చనిపోతుంది కాని అనుబంధం మాత్రం చనిపోదు, దానికి ముగింపులేదు. గురువు ఏస్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి మనలను తీసుకొనిపోయేవరకూ ఆ అనుబంధం తెగిపోదు. భగవాన్ గొడవ మనకు ఎందుకు అని ఇప్పడు నేను అనుకొన్నా అది సాధ్యం కాదు. ఆయనతో విడిపోవటం అనేది సాధ్యంకాదు. అదర్‌నెస్ ఉంటే ఫియర్ వస్తుంది. అదర్‌నెస్ లేకపోతే నీకు ఫియర్‌కూడా లేదు. ఇంట్లో వారిని కూడా వారు వేరు, మనం వేరు అనుకొంటాము కదా. అక్కడ సెపరేట్‌నెస్ ఉంటుంది కదా. అందులోనుండి రాగం వస్తుంది, భయం వస్తుంది. రెండులో నుండే ఫియర్,రాగం అన్నీ వస్తున్నాయి, ఒకటిలోనుండి ఏదీ రాదు.

వాసనాక్షయం ముఖ్యం. వాసనలే పునర్జన్మలను తీసుకొని వస్తాయి. వాసనలో నుండే కోరికలు వస్తాయి. నీకు ఏ రకమైన వాసన లేదు అనుకో. ఇంక నీకు ప్రపంచంతో

పని ఏముంది. వాసనలు లేకపోతే మనం లక్షమంది మధ్యలో కూర్చొన్నా మనం ఒంటరిగా ఉన్నాము అనిపిస్తుంది. మహాత్ములు సమక్షంలో వాసనలు అణుగుతాయి. వాసనలు బయటకు వెళ్లేటప్పుడు దానికి ఎంత బలం ఉందో చూపించిగాని అది బయటకు పోదు. దాని బలం చూపించినప్పుడు మనం ప్రశాంతంగా ఉంటే అది బయటకు పోతుంది. మనం ప్రశాంతంగా నిలబడకుండా ఉంటే, మనం ఓడిపోతే అది మరల రిపీట్ అవుతుంది. అలా మనం ఓడిపోకుండా చూసేవాడే గురువు. వాసన పోతేగాని మనస్సు అణగదు. మనస్సు అణిగితే కాని సమాధిస్థితి రాదు. మన హృదయంలో ఉన్న నిజం మనకు అనుభవంలోనికి రావాలంటే మన ప్రయత్నం అవసరమే. గురువు యొక్క దయ లేకుండా కేవలం నీ ప్రయత్నం వల్లనే అది అనుభవంలోనికి రాదు అంటే నీ ప్రయత్నంతో పాటు గురువు యొక్క అనుగ్రహం ఉండాలి. మన గురించి ఎవరైనా సర్టిఫికేట్ ఇస్తూ ఉంటే ఇదంతా అబద్ధం అని నాకు అనిపిస్తుంది. చోడవరం డాక్టరుగారు జిన్నూరు ఎప్పుడూ రాత్రిటైములో వచ్చేవారు. ఏమండీ మీరు కష్టపడి రాత్రిళ్ళు వస్తున్నారు, పగలు వస్తే బాగుంటుంది అంటే పగలు రావటం నాకు కుదరదండీ అని చెప్పేవారు. నేను చాలా తిరిగాను కానీ మీ దగ్గర పొందిన శాంతి నేను ఎక్కడా పొందలేదు. అందుచేతనే కష్టపడి వస్తున్నాను. నేను మీకోసం రావటంలేదు, నాకోసం మీదగ్గరకు వస్తున్నాను అని చెప్పేవారు. ఆయన చనిపోయేముందు రోజున భార్యతో ఇలా అన్నారట ఈ జన్మలో నాన్నగారు ఇక్కడకు రారు, నేను జిన్నూరు వెళ్లలేను, ఇంక ఈ జన్మలో ఇద్దరం కలుసుకొనే అవకాశం లేదు అని చెప్పారట. ఏదో మామూలుగా అంటున్నారు అని భార్య ఆ మాటలు పట్టించుకోలేదు. మరుసటి రోజున ఆయన చనిపోయారు. అది జాన్మంతర అనుబంధం. శరీరాలు ఎక్కడ ఉన్నా మానసికఅనుబంధం పనిచేస్తుంది. బైబిల్‌లో ఒక మాట ఉంది. నీ పొరుగు వారు ఎవరు? నీ పొరుగువాడు ఎవడు అంటే నీ ఇంటి ప్రక్కన ఉన్న వాడు అని కాదు, మీ క్షేమం కోరేవాడు ఎక్కడ ఉన్నా వాడు మీ పొరుగువాడే. మా యింటికి రండి అని భగవాన్‌ను కొంతమంది అడిగేవారు. ఇప్పుడు నేను మీ యింటి దగ్గర ఉన్నాను కదా. ఇంక మీ యింటికి రావటం ఏమిటి? నువ్వు కిచెన్‌లో ఎక్కడ ఏమి పెట్టుకొన్నావో? నువ్వు డబ్బు ఎక్కడ దాచుకొన్నావో చెప్పమంటావా? నేను మీ యింటి దగ్గర లేను అని నువ్వు అనుకోవచ్చు కాని నేను మీ యింటి దగ్గరే ఉన్నాను అన్నారు భగవాన్.

సత్సంగం అంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉండటం. అది నీకు సాధ్యమవుతుందా? నువ్వు హృదయంలో ఉండగలవా? అది నీకు సాధ్యంకాదు. మీ వాసనలు అక్కడ ఉండనివ్వవు. అందుచేత సద్వస్తువు తాలూకు ఎఱుక ఉన్న వ్యక్తులతో బయట నువ్వు సహవాసం చెయ్యాలి. నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో నీకు అనుబంధం

ఉంటే బాహ్యమైన వాళ్ళతో నీకు పనిలేదు. నీకు ఆ ఎటాచ్‌మెంట్ లేదు కాబట్టి దాని తాలూకు ఎఱుక ఉన్న వారితో సహవాసం చేయటం వలన వాళ్ళ వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి. నువ్వు ఇప్పుడు మనస్సు యొక్క పరిధిలో ఉన్నావు కదా. వీళ్ళు నా వాళ్ళు, వాళ్ళు పరాయి వాళ్ళు అని ఇలా అనుకొంటున్నావు కదా. గురువు ఆ బౌండరీని దాటిస్తాడు, అది గురువు చేసే సహాయం. గురువు నీకు చేసే సహాయం అది ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకో. ఆయనకు ఇతరులు లేరు. మీరు శాంతిగా ఉండాలంటే, సుఖంగా ఉండాలంటే అదర్‌నెస్ ఉండకూడదు. భగవాన్ టీచింగ్‌లో అదర్‌నెస్ ఉండదు. అదర్‌నెస్ కనుక లేకపోతే నువ్వు అలా కూర్చొని ఉండగానే లిబరేషన్ వచ్చేస్తుంది. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది అది నీకు తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది. అది కొత్తగా వచ్చేదికాదు. ఉన్న దానిని గుర్తించటమే మీరు చేయవలసిన పని. ఉన్నవస్తువును తెలుసుకోవటానికి ఏ వాసనలు, కోరికలు, బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో, వాటిని తొలగించుకొంటే ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అది నువ్వు తెలుసుకొనేదికాదు. నీ మనస్సు పవిత్రమైతే, నువ్వు 100% ప్యూరిటీని గెయిన్ చేస్తే అది నీకు తెలియబడుతుంది. టీనేజ్ ఈజ్ వరస్ట్ ఏజ్ అని చెపుతారు. ఆ ఏజ్‌లో మెచ్యూరిటీ ఉండదు. వారు ఆలోచించుకోలేరు, ఇతరులు చెపితే వినరు. అటువంటి ఏజ్‌లో భగవాన్‌కు జ్ఞానం వచ్చింది. టీనేజ్‌లో భగవాన్‌కు మరణానుభవం ద్వారా మరణంలేనివస్తువు రివీల్ అయ్యింది. శరీరం చనిపోయింది. దానిని దహనం చేస్తారు. శరీరం చనిపోయినప్పుడు మనం పోవాలికదా! అయినా పోకుండా ఉన్నాము ఏమిటి? శరీరం పోయినా మనం ఉన్నాము అనే అనుభవం ఆయనకు వచ్చింది. ఇది చాలా గొప్ప అనుభవం. ఆ క్షణంలో ఆయనకు భయం పోయింది. రెండు ఉంటే భయం. ఉన్నది ఒక్కటే అయితే భయం లేదు. ఆ ఒన్‌నెస్ నీకు అనుభవంలోనికి రావాలి. నీ శరీరం ఎక్కడ ఉంది అనేది ముఖ్యంకాదు. నీ మనస్సు ఎక్కడ ఉంది అనేది ఈశ్వరుడు చూస్తాడు. నీ శరీరం సత్సంగం దగ్గర కూర్చోవటం కాదు, మనస్సు కూడా సత్సంగం దగ్గర ఉంటే అప్పుడు దానిని ఈశ్వరుడు హృదయంలోనికి లాగుతాడు. నువ్వు హృదయంలోనికి వెళ్ళలేవు, అంతర్యామే నిన్ను లోపలకు లాగుకొంటాడు. నువ్వు అమెరికాలో ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చుని సద్వస్తువుతో కలిసి ఉండవచ్చు. అలా ఉండలేనప్పుడు సద్వస్తువు తాలూకు అనుభవం ఉన్న మనిషి నీకు దొరికితే వారి సాంగత్యం మంచిది. అదే హోలీ కంపెనీ. అటువంటి వారి సమక్షంలో నీ మనస్సు అణుగుతుంది. నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. అంతర్‌దృష్టి కలగకుండా ఆత్మజ్ఞానం కలుగదు. నీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేసేవాడే గురువు. ఎవరి సమక్షంలో నీ మనస్సు అంతర్ముఖం అవుతుందో వాడే నీకు గురువు.